నేడు తెలంగాణ భవన్‌లో పీవీ వర్ధంతి

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తేతెలంగాణ): మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు వర్ధంతి కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్టు బీఆర్ఎస్ పార్టీ వర్గాలు తెలిపాయి. నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరాయి.

శ్రీనివాస్‌గౌడ్‌పై కేసు పెడితే సహించం

- నిర్ణయాన్ని టీటీడీ బోర్డు ఉపసంహరించుకోవాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి, బీసీ నేత శ్రీనివాస్‌గౌడ్‌పై అక్రమ కేసు నమోదుకు టీటీడీ బోర్డు యోచిస్తున్నట్టు తెలుస్తున్నదని, అలా జరిగితే సహించేది లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి దర్శనంలో విషయంలో తెలంగాణ ప్రజలపై టీడీపీ ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని మాజీ మంత్రి వ్యాఖ్యానించడని చెబుతూ కేసు పెట్టాలనుకోవడం సరికాదని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అన్యాయాన్ని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెడతామనడం సమంజసం కాదని, టీటీడీ బోర్డు తన ఆలోచనను విరమించుకోవాలని తెలిపారు. శ్రీవారి దర్శనం అనంతరం చాలామంది తెలంగాణకు చెందిన అగ్రకుల ప్రజాప్రతినిధులు సైతం ఏపీ సీఎం చంద్రబాబుపై మాట్లాడారని, అప్పుడు ఎలాంటి కేసులు పెట్టని టీటీడీ బోర్డు, కేవలం బీసీ నేత అయిన శ్రీనివాస్‌గౌడ్‌పై కేసు పెట్టాలని యోచించడం వివక్ష కాదా? అని ఆయన ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా మాట్లాడితే వివరణ కోరే అవకాశం, మళ్లీ భవిష్యత్తులో మాట్లాడకుండా షరతు విధించే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఇవేమీ పరిగణలోకి తీసుకోకుండా రాజకీయ కోణంలో కేసు నమోదు చేయాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు.

బతుకమ్మలేని తెలంగాణ తల్లి మాకొద్దు

తెలంగాణ అస్తిత్వంపై కాంగ్రెస్ సర్కారు దాడి

- తెలంగాణ ఉద్యమంలో ఎన్నారైల పాత్ర అపూర్వం
- బీఆర్ఎస్ ఎన్నారై, జాగృతి, సహా పలు ఎన్నారై సంస్థల సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- కాంగ్రెస్ దాడిని తిప్పికొడతాం: తెలంగాణ ఎన్నారైలు

హైదరాబాద్,డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అస్తిత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తున్నదని, ఆ చర్యను తెలంగాణ సమాజం కలిసికట్టుగా అడ్డుకోవాల్సిన అవసరం ఉన్నదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను దూరం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ మహిళలను, పండుగలను అవమానించారని ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లి అందరి అమ్మ వంటిదని, ఆ తల్లిని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. తెలంగాణ జాగృతి ఎన్నారై ఆధ్వర్యంలో ఆదివారం జూమ్ ద్వారా సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఎన్నారైలు పోషించిన పాత్రను మరవలేమని పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో అవహేళనలకు గురైనా తెలంగాణ తల్లి మనలో స్ఫూర్తిని నింపిందని పేర్కొన్నారు. తెలంగాణ తల్లికి ఉద్యమకారులు, కవులు, కళాకారులు కలిసి రూపం ఇచ్చారని, అటువంటి తల్లి రూపాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చడం దారుణమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

బతుకమ్మ పోరాటంలో భాగస్వాములవుతాం: తెలంగాణ ఎన్నారైలు

బతుకమ్మ పండుగకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు రావడానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా ఎన్నారైలు కొనియాడారు. తెలంగాణ అస్తిత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దాడిని తిప్పికొట్టడంలో తామూ భాగస్వాములవుతామని ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ వేదికపై కాంగ్రెస్ ప్రభుత్వం తీరును ఎండగడతామని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఉద్యమ తెలంగాణ తల్లిని రక్షించుకునే క్రమంలో తమ వంతు సాయం చేస్తామని స్పష్టం చేశారు. ఈ జూమ్ మీటింగ్‌లో రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం, జాగృతి రాష్ట్ర నాయకులు నవీన్‌ఆచారి, వివిధ దేశాల బీఆర్ఎస్, జాగృతి నాయకులు జ్యోతి ముద్దం, నవీన్‌రెడ్డి, నాగేందర్‌రెడ్డి, సుమన్ బల్మూరి, నాగరాజు గుర్రాల, కల్యాణ్ కాసుగంటి, నందిని, అనిల్ శ్రీకర్, శేఖర్, కిశోర్, ప్రభాకర్, సంపత్, రవి దన్నపునేని, హరిప్రసాద్, శ్వేత, ఆదర్శ, సుకృతి, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లికి గెజిట్ అవసరమా?

జొన్నలు, మక్కలు విదేశాల్లో కూడా పండుతాయని, అలాంటప్పుడు అవి తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమంటూ ప్రభుత్వం చెప్పడం సరికాదని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. విగ్రహం మార్పు విషయంలోనూ ప్రభుత్వం గోప్యత పాటించిందని, అంత అవసరం ప్రభుత్వానికి ఎందుకని ప్రశ్నించారు. ప్రజల ఆమోదం ఉన్నట్టయితే గోప్యత ఎందుకు పాటించినట్టని ప్రశ్నించారు. ఉద్యమ తెలంగాణ తల్లి కోసం మరొక పోరాటం చేయాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ తెలంగాణ తల్లి పట్ల ప్రేమతో విగ్రహ ప్రతిష్ఠాపన కోసం అనేక గ్రామాల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని తెలిపారు. కొత్త తెలంగాణ తల్లికి గెజిట్ జారీ చేసి ప్రజల మనోభావాలను దెబ్బతీశారని చెప్పారు. భారత మాత, అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు కూడా గెజిట్ ఉందా అని ప్రశ్నించారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్. చిత్రంలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

సీఎంకు పాలన చేతకాకే ఆరోపణలు

- హామీలు నెరవేర్చకుండా విమర్శలు
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్
- అసెంబ్లీ వేదికగా రేవంత్ అబద్ధాలు
- మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

హనుమకొండ, డిసెంబర్ 22: ఎన్నికల హామీలను నెరవేర్చకుండా సీఎం రేవంత్‌రెడ్డి గత బీఆర్ఎస్ పాలనపై ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలోని అన్ని పండుగలను అధికారికంగా నిర్వహించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూసీ ప్రక్షాళన పేరుతో హైదరాబాద్‌లో పేదల ఇళ్లు కూలగొడుతున్నదని, లగచర్లలో రైతుల భూములను లాక్కుంటున్నదని, సినిమా పరిశ్రమను ఇబ్బంది పెడుతున్నదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డికి పాలించే శక్తి లేక ప్రతిపక్షంపై ఎదురు దాడి చేస్తున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ సాక్షిగా అప్పులపై తప్పుడు లెక్కలు చెప్పారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ రాముడయితే.. సీఎం రేవంత్‌రెడ్డి రావణుడని పోల్చారు.

సర్కారును నిలదీస్తున్నందుకే కేటీఆర్‌పై కేసు

బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సతీశ్ ఫైర్

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు, ప్రజాసమస్యలపై కాంగ్రెస్ సర్కారును నిలదీస్తున్నందుకే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి కేసుల కుట్రకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రేవంత్ ఢిల్లీ పర్యటనలోనే ఫార్ములా ఈ రేస్ కేసుపై ప్లాన్ చేసినట్టు పేర్కొన్నారు. జాతీయ పార్టీలు కూడబలుక్కొని కుట్రలుచేస్తున్నా బీఆర్ఎస్ బెదరబోదని స్పష్టంచేశారు. తెలంగాణ జాతిపిత కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిస్తే, రేవంత్‌రెడ్డితో దశాబ్దకాలం వెనక్కి నెట్టబడిందని విమర్శించారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అన్నివర్గాలను మోసం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలన మరిచి కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్న రేవంత్‌రెడ్డికి ప్రజలు ఓటుతోనే బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

ప్రధాని మోదీ డైరెక్షన్‌లోనే సీఎం రేవంత్

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ

హిమాయత్‌నగర్, డిసెంబర్ 22: ప్రధాని మోదీ డైరెక్షన్‌లోనే సీఎం రేవంత్‌రెడ్డి నడుస్తున్నారని మాలమహానాడు అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ వ్యాఖ్యానించారు. మాల మహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు వర్ధంతి సందర్భంగా ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో పీవీ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతి ప్రయోజనాల కోసం ఉన్నత ఉద్యోగాన్ని వదిలి ప్రాణాలు సైతం లెక్కయచేయకుండా పోరాడి అసువులుబాసిన గొప్ప వ్యక్తి పీవీ రావు అని కొనియాడారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలను రేవంత్‌రెడ్డి ఖండించకపోవటం దురదృష్టకరమని పేర్కొన్నారు. మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి బిక్షం మహేందర్, నాయకులు డాక్టర్ ప్రేమ్‌కుమార్, యాదయ్య పాల్గొన్నారు.

అసెంబ్లీ సాక్షిగా రాజ్యాంగ హననం

- కోర్టుల్లోని కేసులపై రేవంత్ పచ్చి అబద్ధాలు
- అల్లు అర్జున్ భుజంపై తుపాకీ పెట్టి సినీ ఇండస్ట్రీని లొంగదీసుకునే యత్నం
- విలేకరుల సమావేశంలో దాసోజు శ్రవణ్

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): 'న్యాయం, ధర్మం గురించి చెప్పాల్సిన పవిత్రమైన అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారు.. కోర్టుల్లో ఉన్న కేసులపై అసెంబ్లీలో అసత్యాలు వల్లించి రాజ్యాంగ హననానికి పాల్పడ్డారు..' అని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ విరుచుకుపడ్డారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నాయకులు పొన్నాల లక్ష్మయ్య, ఫయాజ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. రైతు సమస్యలు, హైడ్రా, మూసీ బాధితుల ఇక్కట్లను పక్కనబెట్టి రోతమాటలు, పిచ్చికూతలతో విచిత్ర విన్యాసాలు చేశారని ధ్వజమెత్తారు. అసెంబ్లీ రూల్స్‌కు విరుద్ధంగా కోర్టుల్లో ఉన్న అల్లు అర్జున్, లగచర్ల కేసుల్లో ఇష్టమొచ్చినట్టు మాట్లాడి న్యాయవ్యవస్థను అపహాస్యం చేశారని మండిపడ్డారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటకు అల్లు అర్జున్‌ను బాధ్యుడిని చేసిన ముఖ్యమంత్రి.. హోంమంత్రిగా తన బాధ్యతలను నుంచి తప్పించుకోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. సినీ నటుడి భుజంపై తుపాకీ పెట్టి సినీ ఇండస్ట్రీని లొంగదీసుకునేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. రేవతి మృతిపై అసెంబ్లీలో మొసలి కన్నీరు కార్చిన ముఖ్యమంత్రి ఆమె కుటుంబానికి ఒక్క పైసా పరిహారమిచ్చారా? అని నిలదీశారు. కనీసం హోంమంత్రిగానైనా బాధిత కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదు? అంటూ ప్రశ్నించారు. పుష్ప సినిమాలో హీరో ఎలా నటించారో తెలియదు కానీ, అసెంబ్లీలో మాత్రం సీఎం అంతకంటే అద్భుతంగా నటించారని ఎద్దేవా చేశారు. ఫార్ములా-ఈ కేసుపై అసెంబ్లీలో చర్చించాలని బీఆర్ఎస్ పట్టుబడితే కోర్టులో ఉన్నదని తప్పించుకున్న ఆయన కోర్టుల్లో విచారణ కొనసాగుతున్న లగచర్ల, సంధ్య థియేటర్ తొక్కిలాసటపై ఎలా మాట్లాడారని నిలదీశారు.

ఓటేసి గెలిపించిన వారికి అవమానం..

సుఫారీ తీసుకొని కలెక్టర్‌పై దాడి చేశారని చివరకు తనకు ఓటేసి గెలిపించిని లగచర్ల గిరిజన రైతులను అసెంబ్లీలోనే అవమానించిన ఘనుడని మండిపడ్డారు. పాలన చేతగాక ప్రశ్నించిన ప్రతిపక్షాలపై బెదిరింపులకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఆయన ఎన్ని కేసులు పెట్టినా సర్కారు దమనకాండను బీఆర్ఎస్ ఎండగడుతుందని, ఇచ్చిన హామీలు నెరవేర్చేదాకా వెంటపడుతుందని తేల్చిచెప్పారు.

ఉద్యోగ ఖాళీలపై శ్వేతపత్రం ప్రకటించాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య

ముషీరాబాద్, డిసెంబర్ 22: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఉద్యోగ ఖాళీలపై ప్రభుత్వం శ్వేతపత్రం ప్రకటించాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగులతో చర్యలు జరిపి ఖాళీల భర్తీకి పూనుకోవాలని కోరారు. హైదరాబాద్ విద్యానగర్ బీసీ భవన్‌లో ఆదివారం జరిగిన నిరుద్యోగుల సదస్సులో ఆయన మాట్లాడారు. టీజీపీఎస్సీ గ్రూప్స్ పోస్టుల సంఖ్యను పెంచాలని, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, ఇతర అన్ని శాఖల్లో ఖాళీలను గుర్తించి ఆ మేరకు పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టాలని కోరారు. ఒకే దఫా 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు కాలయాపన చేస్తున్నారని ప్రశ్నించారు. కొత్త జిల్లాల్లో ఏర్పడిన ఖాళీలను గుర్తించాలని డిమాండ్ చేశారు. బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్ల పల్లి అంజి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు నీల వెంకటేశ్, నందగోపాల్, బీ శ్రీనివాస్, సతీశ్, ఉదయ్, పృథ్వీగౌడ్, నిఖిల్, వెంకటేశ్ గౌడ్, బలరామ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫెమా ఉల్లంఘనపైనే ఈడీ దృష్టి

- ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ఖాతాల పరిశీలన
- బ్యాంకు, హెచ్ఎండీపీ, ఎంపయూడీ అధికారులకు నోటీసులు?
- నిబంధనలను తుంగలో తొక్కిన అధికారులను వదిలేసి కేటీఆర్‌ను ఏ1గా చేర్చడం వెనక కుట్ర

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో ఫారెన్ ఎక్స్చేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఫెమా) ఉల్లంఘనలపైనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ప్రధానంగా దృష్టిసారించినట్టు తెలిసింది. విదేశీ కంపెనీకి డాలర్ల రూపంలో జరిగిన నగదు చెల్లింపులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఈ క్రమంలో హిమాయత్‌నగర్‌లోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు అధికారులను తొలుత ప్రశ్నించనున్నట్టు తెలిసింది. ఈ మేరకు సోమ, మంగళవారాల్లో ఐవోబీ అధికారులకు ఈడీ నుంచి నోటీసులు అందతాయని భావిస్తున్నారు. విచారణలో వారు ఇచ్చే సమాచారంతో ఐఏఎస్ అర్వింద్ కుమార్‌కు నోటీసులు, ఆ తర్వాత మాజీ మంత్రి కేటీఆర్‌కు విచారణకు సంబంధించిన నోటీసులు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని ఈడీ వర్గాలు అంటున్నాయి. బ్రిటన్‌లోని ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో)కు డబ్బు చెల్లించే క్రమంలో నాటి ప్రభుత్వం తరపున అధికారులు ఎలాంటి నిబంధనలు పాటించారు? ముఖ్యంగా హిమాయత్‌నగర్‌లోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ఆర్బీఐ నిబంధనలు పాటించిందా? ఉల్లంఘించిందా? ఒకవేళ ఉల్లంఘిస్తే అందుకు దారి తీసిన పరిస్థితులు ఏంటి? దాని వెనుక ఎవరిదైనా ప్రోద్బలం ఉన్నదా? అనే కోణంలోనే విచారిస్తారని సమాచారం.

కేటీఆర్‌ను ఇరికించే కుట్ర

ఎఫ్ఈవోకు నిధుల చెల్లింపు విషయంలో ఆర్బీఐ అనుమతి లేదని కొన్ని ప్రభుత్వ అనుకూల మీడియా చెబుతున్నా నేటికీ దానిపై స్పష్టమైన సమాచారం లేదు. సంబంధిత పత్రాలు బయటికి విడుదల చేయలేదు. అయితే, మంత్రి హోదాలో డబ్బులు చెల్లించాలని తానే అధికారులు చెప్పానని కేటీఆర్ వెల్లడించగా, ఆర్బీఐ నిబంధనలకు అనుగుణంగా, సంబంధిత ఫార్మాట్‌లో పంపాల్సిన బాధ్యత ముమ్మాటికీ నాటి ప్రభుత్వ అధికారులు, బ్యాంకు అధికారులదే. ఈ నేపథ్యంలో నిబంధనలు తుంగలో తొక్కిన అధికారులను వదిలేసి కేటీఆర్‌ను ఏ1గా చేర్చడం వెనుక ఏదో కుట్ర దాగి ఉందనేది అర్థమవుతుందని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. ఫార్ములా-ఈ కారు రేసు కేసులో ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించిన ఏసీబీ అధికారులు తొలుత తమకు ఫిర్యాదు చేసిన పురపాలకశాఖ కార్యదర్శి దానకిషోర్ వాంగ్మూలాన్ని రికార్డు చేయనున్నట్టు సమాచారం. వారు సైతం అర్వింద్‌కుమార్ ఐఏఎస్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డికి నోటీసులిచ్చి వారిని విచారిస్తారని తెలిసింది.

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, భిక్షమయ్యగౌడ్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

నల్లగొండ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

- మంత్రి కోమటిరెడ్డికి బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా నేతల సవాల్
- ఆయనో రాజకీయ అవివేకి అని విమర్శ
- నల్లగొండకు కేసీఆర్ ఏమీ చేయలేదనడంపై ఫైర్

బీఆర్ఎస్ పాలనలోనే ఫ్లోరైడ్ నుంచి విముక్తి

ఏండ్లుగా పట్టి పీడించిన ఫ్లోరైడ్ రక్కసి నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు బీఆర్ఎస్ పాలనలోనే విముక్తి లభించిందని ఎమ్మెల్సీ కోటిరెడ్డి గుర్తుచేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాడు కేసీఆర్ వ్యవసాయ, నీటిపారుదల రంగాలను కొత్త పుంతలు తొక్కించారని, కాళేశ్వరం ద్వారా సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ నియోజకవర్గాలకు సాగు, తాగునీటిని అందించారని చెప్పారు. అభివృద్ధే జరగలేదనడం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాజకీయ అవివేకానికి నిదర్శనమని మండిపడ్డారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అదనంగా 3 లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి వచ్చిందని మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ వివరించారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, అన్నిరకాల మౌలిక వసతులు బీఆర్ఎస్ పాలనలోనే సమకూరాయని గుర్తుచేశారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన పనులను తాము చేసినట్టు చెప్పుకోవడానికి ఇప్పటి మంత్రులకు సిగ్గుండాలని మండిపడ్డారు.

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డీ.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కనీవినీ ఎరుగని రీతిలో కేసీఆర్ పదేండ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులు కనిపిస్తలేదా? సంక్షేమ పథకాలు నీ దృష్టిలో పడతలేదా? మా బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో, ఏడాది మీ కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చిద్దామా? అని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి బీఆర్ఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ముఖ్య నేతలు సవాల్ విసిరారు. నల్లగొండ జిల్లాకు కేసీఆర్ ఏమీ చేయలేదని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనడంపై వారంతా భగ్గుమన్నారు. ఉమ్మడి జిల్లాలో పెరిగిన సాగు అయకట్టు, సంక్షేమ పథకాలు, మెడికల్ కాలేజీలు, నూతన కలెక్టరేట్ భవనాలు మీ కంటికి కనిపించడం లేదా? అని నిలదీశారు. కోమటిరెడ్డికి పదేండ్లలో జరిగిన అభివృద్ధి ఎలా కనిపిస్తుందని ఎద్దేవా చేశారు. కోమటిరెడ్డి బ్రదర్స్ ఎప్పుడు ఏం మాట్లాడుతారో ఎవరికీ అర్థంకాదని ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, బూడిద భిక్షమయ్యగౌడ్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పార్టీ నేత చింతల వెంకటేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

నల్లగొండలో ఒక్కరోడ్డయినా వేశారా?

పదేండ్లలో కేసీఆర్ ఏమీ చేయలేదని వ్యాఖ్యానించడం కోమటిరెడ్డి దివాలాకోరుతనానికి నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ మండిపడ్డారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి నల్లగొండ పట్టణంలో ఒక్క కొత్త రోడ్డయినా వేశావా? అని నిలదీశారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారాల నుంచి డబ్బు వసూలు తప్ప.. జిల్లా అభివృద్ధిని ఏనాడూ పట్టించుకోలేదని మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ మండిపడ్డారు. ఏడాదిలో కోమటిరెడ్డి జిల్లాకు ఏం చేశారో ప్రజలకు చెప్పాలని, ఆయనతో తాము చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పచ్చి పొలిటికల్ బ్రోకర్, ఆయనను కాంగ్రెస్ పార్టీ ఎట్లా భరిస్తున్నదో అర్థం కావడం లేదని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. మునుగోడు ఉపఎన్నికల్లో తమ్ముడు రాజగోపాల్‌రెడ్డి కోసం బీజేపీకి ఓట్లేయమని వెంకట్‌రెడ్డి చెప్పింది నిజం కాదా? అని ప్రశ్నించారు. నాడు సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి తన దగ్గరకు రానివ్వకపోతే కోమటిరెడ్డి తెలంగాణ కోసమని దొంగ దీక్ష చేశారని బీఆర్ఎస్ నేత చింతల వెంకటేశ్వర్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణలో కొత్త జిల్లాల కలెక్టరేట్లు ఉన్నట్టు.. ఇతర రాష్ట్రాల్లో సచివాలయాలు కూడా లేవని కోమటిరెడ్డి మెచ్చుకోలేదా? అని నిలదీశారు.

విద్యారంగంలో అగ్రభాగాన వనపర్తి

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, డిసెంబర్ 22 : , భా వితరాలకు ఉన్నత విద్యను అందించి వనపర్తి జిల్లాను విద్యారంగంలో అగ్రభాగాన నిలిపినట్టు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ఆదివారం డిగ్రీ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి మాట్లాడుతూ తన మామయ్య, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాలకిష్టయ్య కళాశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. వనపర్తి నియోజకవర్గాన్ని అగ్రభాగంలో నిలపడానికి చిన్నారెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డితో పోటీపడి పనిచేశానని చెప్పారు. వనపర్తికి బీసీ డిగ్రీ గురుకుల కళాశాల మంజూరైతే అప్పటి మంత్రిగా అగ్రికల్చర్ కళాశాలను తీసుకువచ్చి, ఇంజినీరింగ్, మెడికల్, నర్సింగ్, ఫిషరీష్ కళాశాలల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశానని గుర్తుచేశారు. అనంతరం ముఖ్య అతిథులతో కలిసి 50 వసంతాల సావనీర్‌ను ఆవిష్కరించారు.

దోభీలకు కాంగ్రెస్ సర్కారు దోఖా

- ప్రభుత్వ సంస్థల్లో దోబీలకు దక్కని వాషింగ్ వర్క్స్
- బీఆర్ఎస్ హయాంలో రజకుల కోసం ప్రణాళికలు

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ సర్కారు కులవృత్తులు, వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి వినూత్నమైన, విప్లవాత్మకమైన పథకాలను ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ దవాఖానలు, మెడికల్ కాలేజీలు, గురుకులాలు, క్రీడా సంస్థలు, ఆలయాలు, అతిథి గృహాలు, పోలీస్ హెడ్ క్వార్టర్స్, బెటాలియన్‌లలో బట్టలు ఉతికే పనులను రజకులకే అప్పగించాలని నిర్ణయించింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ జీవోను అటకెక్కించింది.

శ్రమదోపిడీకి అడ్డుకట్ట జీవో 102

ప్రభుత్వ సంస్థల్లో బట్టలు ఉతికే పనులను కాంట్రాక్టర్లకు అప్పగించే విధానం అమల్లో ఉంది. దీంతో బడాబాబులు కోట్లు సంపాదిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో అప్పటి సీఎం కేసీ